సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 7 । జూలై । 2023



గోశాలలకు కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న కోడెలను పోచంపల్లికి చెందిన మహేశ్వరీ గోశాలకు, కొండాపూరం తండాలోని పోతన గోశాలకు 20 చొప్పున గురువారం అందించారు.



బోసిపోయిన రాజన్న ఆలయం

వేములవాడ: నిత్యం రద్దీగా ఉండే రాజన్న ఆలయం ఆషాఢమాసంతో గురువారం బోసిపోయి కనిపించింది. భక్తుల రద్దీ చాలా తక్కువగా ఉంది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మానేరు ఆయకట్టుకు సాగునీరు



రైతులతో మాట్లాడుతున్న డీఈఈ

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎగువ మానేరు ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఈఈ రవికుమార్ తెలిపారు. ముస్తాబాద్‌లో మానేరు కెనాల్‌ను గురువారం పరిశీలించారు. కెనాల్‌లో మురుగు నీరు చేరకుండా చూడాలన్నారు. గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ముస్తాబాద్ నుంచి తెర్లుమద్ది వరకు వెళ్లే కెనాల్‌పై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. వర్షాకాలం పంటలకు ప్రాజెక్టు తైబందీ త్వరలోనే నిర్ణయిస్తామని చెప్పారు. ఏఈ వంశీకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

మానేరులోని మోటార్లు తీయాలి

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి శుక్రవారం ఉదయం 8 గంటలకు రేడియల్ గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు గురువారం తెలిపారు. మానేరునదిలో ఏర్పాటు చేసుకున్న మోటార్లను రైతులు తీసివేయాలని సూచించారు. నీటి ఉధృతికి మోటార్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

'ఐటీ మంత్రిగా సిరిసిల్లకు ఏం తెచ్చావ్?'



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ఐటీ మంత్రిగా సిరిసిల్లకు ఏం ప్రాజెక్టు తెచ్చావో చెప్పాలని మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేటకు 30 పడకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీ, సిరిసిల్లలో మహిళ డిగ్రీ కాలేజీల హామీల అమలులో మాట తప్పారని విమర్శించారు. మల్కపేట రిజార్వయర్ నుంచి ఎగువ మానేరుకు సాగు నీరు అందించలేదన్నారు. ఈ ప్రాంత బిడ్డ కాదు కాబట్టే ఇక్కడ ప్రేమతో పనులు చేయడం లేదని విమర్శించారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గంట దుర్గాగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, చెన్ని బాబు, గంట బుచ్చాగౌడ్, రాజేందర్, సంతోష్‌గౌడ్, రాంరెడ్డి ఉన్నారు.

కొందరికే పోడు పట్టాలు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం కొందరికే పోడు పట్టాలిచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో గురువారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో అధికారులు సర్వే చేయగా 5 వేల మంది గిరిజనులు అర్హులుండగా.. కేవలం 1,614 మందికి మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. అందరికి ఇవ్వాలని కోరారు. పంతం రవి, మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు, మల్లేశ్, శంకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

వేములవాడఅర్బన్: నాంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం బీసీ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కుళ్లిపోయిన కూరగాయలతో మధ్యాహ్న భోజనం చేస్తున్నారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో చొరవ తీసుకొని నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని కోరారు. దిలీప్, అనిల్, సాయి, శివ ఉన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో గురువారం ఎనిమిది మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. భారీ వర్షసూచనల నేపథ్యంలో పొడి వాతావరణం నెలకొంది. తంగళ్లపల్లిలో అత్యధికంగా 22.0 మిల్లీమీటర్లు పడగా.. ముస్తాబాద్‌లో 19.3, గంభీరావుపేటలో 17.5, ఎల్లారెడ్డిపేటలో 7.4, ఇల్లంతకుంటలో 7.3, సిరిసిల్లలో 6.9, చందుర్తిలో 0.6, కోనరావుపేటలో 0.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగి, వేములవాడరూరల్, బోయినపల్లి, వేములవాడ, వీర్నపల్లి మండలాల్లో వర్షం పడలేదు.

పోడుభూములకు త్రీఫేజ్ కరెంట్

- గిరిజనుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం
- సంపద సృష్టించేలా దళితబంధు
- ఇతరులకు ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరాలి
- సిరిసిల్లలో మంత్రి కేటీఆర్
- సిరిసిల్ల రూపురేఖలు మార్చారు
- మంత్రి కొప్పుల ఈశ్వర్



చిన్నతరహా వ్యాపార లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న మంత్రులు కేటీఆర్, ఈశ్వర్

సిరిసిల్ల: జిల్లాలోని పోడుభూములకు త్రీఫేజ్ కరెంట్ అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో జిల్లాలోని 1,614 కుటుంబాలకు 2,558.34 ఎకరాల పోడుభూముల పట్టాలను గురువారం పంపిణీ చేశారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ గిరిజన తండాలు గ్రామపంచాయతీలుగా మారాయని, గిరిజనుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా పట్టాలతోపాటు రైతుబంధు సాయం అందిస్తున్నామన్నారు. జిల్లాలో దళితబంధు ద్వారా సంపద సృష్టించేలా, ఇతరులకు ఉపాధి కల్పించేలా యూనిట్లు అందించామని తెలిపారు. కలెక్టర్ అనురాగ్ జయంతి చొరవతో లబ్ధిదారులను ఒప్పించి రైస్‌మిల్లులు, పెట్రోల్‌బంక్‌లు, కోళ్లఫారాలు, సిమెంట్ మిక్సింగ్ మిషన్లు పెట్టుకునేలా చూశామన్నారు.

సిరిసిల్ల రూపురేఖలు మారాయి : మంత్రి కొప్పుల

సిరిసిల్ల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ చేశారని మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. విద్య, వైద్యరంగాల్లో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం కేసీఆర్ చేశారన్నారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేవారని, బ్యాంకర్లు ష్యూరిటీ అడిగితే తాకట్టు పెట్టేందుకు ఏమీ లేక నిరాశకు గురయ్యేవారని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు వంద శాతం సబ్సిడీతో ఆర్థికసాయం అందిస్తున్నామని వివరించారు. గతానికి, ఇప్పటికీ ఉన్న తేడాను గుర్తించి సమయం వచ్చినప్పుడు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మాట్లాడుతూ 70 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మెట్టప్రాంతానికి సాగునీరు సాధించారన్నారు. అనంతరం గిరిజనులతో మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ సహపంక్తి భోజనాలు చేశారు. కలెక్టరేట్‌లో దళితబంధు లబ్ధిదారుల యూనిట్లను ప్రారంభించి, వారితో ముచ్చటించారు. దళితబంధు ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. 128 మంది ఎస్సీ లబ్ధిదారులకు వంద శాతం సబ్సిడీపై రూ.66 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. గిరిజన కళాశాల ఫైన్ ఆర్ట్స్ విద్యార్థిని గుగులోత్ మమతను వేదికపైకి పిలిచి మంత్రి కేటీఆర్ సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యా నాయక్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు జిందం కళాచక్రపాణి, రామతీర్థం మాధవి, ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోడు లబ్ధిదారులతో భోజనం చేస్తూ..

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



వ్యవసాయ కళాశాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

సిరిసిల్లఅర్బన్/సిరిసిల్లటౌన్/బోయినపల్లి(వేములవాడ): తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

మంత్రిని కలిసిన ప్రభాకర్ కుటుంబీకులు

తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన కారోబార్ ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మరణించగా.. బాధిత కుటుంబీకులు మంత్రి కేటీఆర్‌ను కలిసి, ఆదుకోవాలని వేడుకున్నారు. వ్యవసాయ కళాశాలలో ఉద్యోగావకాశం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికావాలని పక్కనే ఉన్న కళాశాల ప్రిన్సిపల్ సెక్రెటరీని ఆదేశించారు. పిల్లల చదువుకు సహాయం చేస్తానని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు.

డీస్లడ్జింగ్ వాహనాలు ప్రారంభం

సిరిసిల్లలో శానిటేషన్ నిర్వహణ, మహిళా సంఘాల సభ్యులను ఆర్థిక బలోపేతం చేయడంలో భాగంగా ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ సహకారంతో రెండు డీస్లడ్జింగ్ వాహనాలను అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ జగతి, అపరంజి మహిళా పొదుపు సంఘాలకు చెందిన సభ్యులకు రెండు వాహనాలను అందించినట్లు తెలిపారు. ఒక్కో వాహనం రూ.33.91 లక్షలు ఉండగా.. సబ్సిడీ పోను రూ.14.72 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

మనోజ్ కుటుంబానికి పరామర్శ

బోయినపల్లి మండలం విలాసాగర్‌కు చెందిన బీఆర్‌ఎస్వీ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. వారి కుటుంబాన్ని మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఎంపీపీలు పడిగెల మానస, పర్లపల్లి వేణుగోపాల్, జిల్లెల్ల ఎంపీటీసీ వెంకట్‌రావు, సర్పంచ్ మాట్ల మధు, నాయకులు రాజన్న, కత్తెరపాక కొండయ్య ఉన్నారు.

పట్టా కోసం ఎదురుచూశాం



మేం భూమి దున్నుకుంటున్నప్పటికీ పట్టాలు లేవు. ఎప్పటి నుంచో పట్టాల కోసం ఎదురుచూస్తున్నాం. మాకు 4.30 ఎకరాల భూమికి పట్టా, పాస్‌బుక్కు ఇచ్చారు. రైతుబంధు కూడా ఇస్తున్నారు. బ్యాంకు లోను కూడా తీసుకోవచ్చట. చాలా సంతోషంగా ఉంది.

– భానోత్ వినోద, రంగంపేట

పట్టాలు లేక తిప్పలు పడ్డాం



మాకు భూమి పట్టాలు లేక ఉత్తగనే దున్నుకున్నాం. చాలా ఏళ్లుగా ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్నాం. ఎన్నోసార్లు అధికారులకు చెప్పినా పని కాలేదు. మేం దున్నుకునే భూమికి పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. మాకు 35 గుంటల భూమికి పట్టా ఇచ్చిండ్రు.

– భూక్యా సరోజన, వీర్నపల్లి

టైలరింగ్‌కు సాయం అందింది



నేను ఇంట్లోనే టైలరింగ్ చేస్తాను. ప్రభుత్వం ద్వారా రూ.50వేల చెక్కు ఇచ్చారు. టైలరింగ్‌కు అవసరమైన వస్తువులు కొనుక్కుంటాను. వందశాతం సబ్సిడీ కావడంతో మళ్లీ ఆ డబ్బులు చెల్లించాల్సిన పని లేదు.

– బత్తుల సంపూర్ణ, ఆవునూర్

జ్యువెలరీ షాపు పెట్టాను



నేను జ్యువెలరీ షాప్ పెట్టాను. ప్రభుత్వం ద్వారా రూ.50 వేలు ఇచ్చారు. షాపులో ఎక్కువ వెరైటీలను పెట్టేందుకు ఈ డబ్బులను వెచ్చిస్తాను. మా ఆయన హన్మంతు సెంట్రింగ్ పనిచేస్తాడు. ఈ ఆర్థిక సాయం మాకు అక్కరకొచ్చింది.

– బొల్లారం దీపిక, తంగళ్లపల్లి

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

- పరీక్ష సమయంలో మొరాయించిన మైక్రోఫోన్
- మధ్యలోనే నిలిచిపోయిన డేటా ట్రాన్స్‌ఫర్?
- ఇద్దరు లెక్చరర్ల సాయంతో హైటెక్ కాపీయింగ్
- తాజా అరెస్టులతో మరోసారి తెరపైకి వ్యవహారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కరీంనగర్‌కు ఉన్న లింకులు తవ్వినకొద్దీ వెలుగుచూస్తునే ఉన్నాయి. తాజాగా ఓ ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్ల అరెస్టుతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకొచ్చింది. ఇటీవల హైటెక్ కాపీయింగ్‌కు సంబంధించిన వ్యవహారం వెలుగుచూసిన సమయంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కరీంనగర్‌లోని బొమ్మకల్‌కు వచ్చిన సంగతి తెలిసిదే. తాజాగా మరోసారి సిట్ అధికారులు కరీంనగర్‌కు వచ్చారు. జిల్లాలోని ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేస్తున్న ఇద్దరు లెక్చరర్ల పాత్రపై ఆధారాలు లభించడంతో సిట్ అరెస్టు చేసింది. వాస్తవానికి ఈ వ్యవహారంలో వీరు సాయపడ్డారనే ఆరోపణలపైనే అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

ఏం జరిగింది?

ఇద్దరు ప్రైవేటు కాలేజీ లెక్చరర్లకు డీఈ రమేశ్‌తో ముందే పరిచయం ఉంది. పరీక్షరాసే అభ్యర్థుల నుంచి రూ.75 లక్షలకు రమేశ్ ఒప్పందం చేసుకున్నాడన్న ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే కరీంనగర్ నుంచి కొందరితో రమేశ్ అవగాహన కుదుర్చుకున్నాడు. తాను ఒప్పందం చేసుకున్నవారు పరీక్ష రాసేచోట అతని సన్నిహితులైన లెక్చరర్లు సహకరించేలా ముందే రూ.5లక్షల చొప్పున చెల్లించాడని ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వీరిద్దరూ రమేశ్ సూచించిన అభ్యర్థులను సరిగా తనిఖీ చేయకుండా.. హైటెక్ డివైజ్‌లు, శక్తిమంతమైన మైక్రోఫోన్‌లతో లోనికి వెళ్లేలా సహకరించారు. కానీ.. ఆరోజు వీరు సహకరించిన అభ్యర్థుల డివైజ్‌లు మధ్యలోనే మొరాయించాయని, సరిగా డేటా ట్రాన్స్‌ఫర్ కాక వాళ్లు పరీక్ష క్వాలిఫై కాలేదని ప్రచారంలో ఉంది. ఇందులో వాస్తవమెంత ? అన్న దానిపై ప్రత్యేక దర్యాప్తు బృందం దృష్టి సారించిందని సమాచారం.

అప్పుడు ఆధారాలు లభించలేదా?

బొమ్మకల్‌లో మాజీ ఎంపీటీసీ కూతురును అరెస్టు చేయడానికి గత జూన్ మొదటివారంలోనే సిట్ అధికారులు యత్నించారు. ఈక్రమంలోనే మాజీ ఎంపీటీసీ కుటుంబం పరారైంది. ఆ సమయంలోనే ఈ ఇద్దరు లెక్చరర్లను సిట్ ఎందుకు విస్మరించింది? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లెక్చరర్లు సహకరించిన అభ్యర్థులు ఫెయిల్ కావడం వల్లే వీరిపాత్ర ఆలస్యంగా వెలుగుచూసిందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. సిట్ తొలుత పరీక్షల్లో మంచి మార్కులతో పాస్ అయిన అభ్యర్థులపై దృష్టి సారించిందని. కానీ.. రమేశ్ బ్యాంకు లావాదేవీల ఆధారంగా ఇప్పుడు వీరిద్దరి పాత్ర వెలుగుచూసిందని ప్రచారం సాగుతోంది.

సమయానికి రారేమి?

- సిరిసిల్ల ఆస్పత్రిలో ఇష్టారీతిగా విధులకు హాజరు
- రోగులకు ఎదురుచూపులే దిక్కు
- రెండు రోజులుగా పనిచేయని ఎక్స్‌రే మిషన్
- పట్టించుకోని అధికారులు
- ఒకే భవనంలో 20 విభాగాలు



గురువారం ఉదయం 9:30 గంటలు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి అప్పటికే రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఓపీ విభాగంలోని ఈఎన్‌టీ వైద్యుడి కుర్చీ ఖాళీగా ఉంది. పక్కనే గల ఆర్థో, గైనిక్, జనరల్ విభాగాల్లో వైద్యులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. నిత్యం వందల సంఖ్యలో వచ్చే రోగులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు ఓపీ వార్డులో సేవలందించాల్సి ఉండగా కొందరు సమయపాలన పాటించడం లేదు.



ఎమర్జెన్సీ విభాగంలో రోగులకు అందుతున్న వైద్యసేవలు



మీరు చూస్తున్న ఈ ఫొటో జిల్లా ఆస్పత్రిలోని ఎక్స్ రే సెంటర్. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎక్స్‌రే మిషన్ పనిచేయకపోవడంతో వంద మంది వెనుదిరిగి గురువారం ఉదయం వచ్చి ఇలా బారులు తీరారు. మిషన్ ఇంకా పనిచేయడం లేదని నిర్వాహకులు చెప్పడంతో ఇలా ఎదురుచూస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది బాధ్యతా రాహిత్యానికి ఇది నిదర్శనం.

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలోని వైద్యులకు సమయపాలన కరువైంది. ఇష్టారీతిగా విధులకు హాజరవుతుండడంతో రోగులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఉదయం 9:30 గంటలు దాటుతున్నా ఓపీ చూసేందుకు వైద్యులు రాకపోవడంతో రోగులకు ఎదురుచూపులు తప్పలేదు. కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందుతున్నా సమయపాలన లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి 'సాక్షి' ఆస్పత్రిని విజిట్ చేయగా పలు విషయాలు వెలుగుచూశాయి.

సమస్యలు ఇవీ..

- ఓపీ సమయంలో వైద్యులు లేక.. వారి గదులు ఖాళీగా ఉన్నాయి.
- జిల్లా ఆస్పత్రిలో స్థలాభావంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- వాహనాల పార్కింగ్‌కు స్థలం లేదు. మార్చురీ వద్ద స్థలం తక్కువగా ఉంది.
- గైనకాలజిస్టుల ఓపీ యూనిట్‌ను విస్తరించాలి.
- టాయిలెట్స్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. దుర్గంధం వస్తోందని వాపోతున్నారు.
- భవనాన్ని మూడు దశాబ్దాల క్రితం వంద పడకల ఆస్పత్రికి సరిపడేలా నిర్మించారు. అదే భవనంలో ప్రస్తుతం 230 పడకలతో వైద్యసేవలందిస్తున్నారు. పైగా జిల్లా ఆసుపత్రిగా స్థాయి పెరిగినా స్థలాభావంతో 300 పడకల ఆస్పత్రిగా మారడం లేదు.


గంట నుంచి కూర్చున్న



మాది లక్ష్మీపురం. 26 రోజుల కింద ఇక్కడే కాటరాక్ట్ ఆపరేషన్ చేసిండ్రు. డాక్టర్ ఐదు రోజుల తర్వాత రమ్మంటే వచ్చి చూపు మబ్బుగా ఉందని చెప్పిన. మూడు వారాలు చుక్కలు మందు వాడమన్నరు. ఇప్పటికీ అట్లనే ఉంది. ఇక్కడికి వస్తే డాక్టర్ రూమ్ తీసిలేదు.

– మల్లవేని సత్తవ్వ, లక్ష్మీపురం

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం



ప్రతి రోజు వైద్యులు పూర్తిస్థాయిలో హాజరవుతున్నారు. సమయపాలన పాటించని వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు 6, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 25, ఆస్పత్రికి చెందిన రెగ్యులర్ 27, కాంట్రాక్టు 11 మంది వైద్యులు ఉన్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు ఉన్నాయి.

– డాక్టర్ మురళీధర్‌రావు, సూపరింటెండెంట్

వేములవాడలో వైద్యుల కొరత



వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన జనాలు

వేములవాడఅర్బన్: గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వేములవాడలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉంది. ఆస్పత్రికి నిత్యం 270 నుంచి 300 మంది వరకు ఓపీలో రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఐపీ మాత్రం 60 నుంచి 70 మంది ఉంటున్నారు. అన్ని రకాల వైద్యం అందుతు న్నా సిబ్బంది సరైన సంఖ్యలో లేరు. ఆస్పత్రి వే ళలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు.

కొట్టొస్తున్న వైద్యుల కొరత

- వేములవాడ ఏరియా ఆస్పత్రిలో 23 వైద్యుల పోస్టులకు తొమ్మిది మంది ఉన్నారు.
- ఆరుగురు వైద్యులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు.
- రెగ్యులర్ వైద్యులు ముగ్గురు ఉన్నారు.
- 60 మంది స్టాఫ్‌నర్స్‌కు 19 మంది ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు.
- రేడియోగ్రాఫర్ పోస్ట్ ఖాళీగా ఉంది.
- ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లకు ఒక్కరే ఉన్నారు. ఆ ఒక్కరు సైతం డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.
- సీటీస్కాన్ టెక్నీషియన్ లేరు.

క్లుప్తంగా

గీతకార్మికునికి సన్మానం



గీత కార్మికులను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాలలో కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు చెట్టుపైనే చిక్కుకున్న సహచర గీత కార్మికుడిని ప్రాణాలకు తెగించి కాపాడిన ఆరేటి పర్శరాములును గ్రామపంచాయతీ పాలకవర్గం గురువారం సన్మానించింది. ఆరేటి రాములు చెట్టుపైనే ఇరుక్కుని రెండు గంటలపాటు నరకయాతన అనుభవించాడు. తోటికార్మికుడు పర్శరాములు ధైర్యంగా చెట్టుపైకి ఎక్కి కాపాడాడు. పర్శరాములు ధైర్య సాహసాలను కొనియాడారు. సర్పంచ్ కదిరె రజిత, ఉపసర్పంచ్ రేండ్ల హన్మంతు, కార్యదర్శి మహేందర్ సీసీ రమణ, సీఏ భాగ్యమ్మ, గౌడ సంఘం అధ్యక్షుడు కదిరె నాంపల్లి పాల్గొన్నారు.

రాజన్న సేవలో దినేశ్ చౌదరి



వేములవాడ: బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ చౌదరి దంపతులు గురువారం రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం కల్పించి అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. వారి వెంట కౌన్సిలర్ గోలి మహేశ్ ఉన్నారు.

అదుపుతప్పిన కారు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని విలాసాగర్ గ్రామ పరిసరాల్లో బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని కారు అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాక నుంచి విలాసాగర్ వస్తున్న కారు విలాసాగర్ పరిసరాల్లో అదుపుతప్పి ఓ పక్కకు పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని వారికి పెద్దగా గాయాలు కాలేదని సమాచారం.

కార్మికుల కష్టాన్ని గుర్తించండి



మద్దతు తెలుపుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు సరిపడా వేతనాలు చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. వేములవాడలోని తెలంగాణచౌక్‌లో గురువారం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం, వారి శ్రమకు తగ్గట్టు వేతనాలు అందించాలని కోరారు. సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, కార్మికులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో సమన్వయ లోపం

- సార్ల సర్దుబాటులో సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న హెచ్ఎంలు
- అభ్యసనలో నష్టపోతున్న విద్యార్థులు
- సరిచేయాలంటున్న ఎస్ఎంసీ ఛైర్మన్లు

జిల్లాలో విద్యాలయాల గణాంకాలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	– 510
విద్యార్థులు	– 49,684
ఉపాధ్యాయులు	– 2,651



‘ఇదీ ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటలోని ప్రభుత్వ పాఠశాల. ఇందులో 8 మంది పిల్లలుండగా ఇక్కడ చదువు చెప్పరన్న అనుమానంతో వారు మరో పాఠశాలకు వెళ్లడానికి సిద్ధమైనటట్లు విశ్వసనీయ సమాచారం. విద్యార్థులు లేకున్నా ఇక్కడ ఆరుగురు ఉపాధ్యాయులు విధుల్లో ఉన్నట్లు తెలిసింది. వీరిని ఇప్పటికే సర్దుబాటులో భాగంగా మరో పాఠశాలకు విధులు కేటాయిస్తే బాగుందేదని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.’

సిరిసిల్లఎడ్యుకేషన్: ‘జిల్లాలోనే అత్యధికంగా 1005 మంది విద్యార్థులున్న సిరిసిల్ల బాలికల జెడ్పీ పాఠశాలలో విద్యతో పాటు ఆటలు, పాటల్లో ముందుండాలని మంత్రి కేటీఆర్ కితాబిచ్చిన సంగతి విదితమే. కానీ ఈ పాఠశాలలో విద్యార్థుల బోధనకు సరిపడ ఉపాధ్యాయులు లేరు. హిందీ, బయాలజీ బోధించడానికి ఇంకో ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం. అలాగే పాఠశాల ప్రాంగణంలో ఆటస్థలం ఉన్నా ఆటలాడించేందుకు పీఈటీలు లేరు. దీంతో విద్యతో పాటు ఆటపాటల్లో సమన్వయం లేక పాఠశాల విద్యార్థులు అన్నింటా వెనుకంజలో ఉంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని, వారికి మౌళిక సదుపాయాలు కల్పించి ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన అందించాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరడం లేదు. విద్యార్థులున్న బడిలో ఉపాధ్యాయులు లేక, అసలు విద్యార్థులే లేని పాఠశాలలో ఉపాధ్యాయులు అధికంగా ఉండడంతో సర్కారు బడులు సర్దుబాటు సమస్య ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. దీనిని అధిగమించేందుకు విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా సార్ల సర్దుబాటు చేయాలని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతు న్నారు. విద్యాసంవత్సరానికి ముందుగా, లేనిపక్షంలో ప్రారంభ తేదీ తర్వాత 10 రోజులకు విద్యాశాఖ అధికారులు వీటిని సరిచేయాల్సి ఉండగా జిల్లాలో నేటికి సార్ల సర్దుబాటు చేయలేదని పలువురు హెచ్ఎంలు, ఎస్ఎంసీ ఛైర్మన్లు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించకుంటే సర్కారు బడులపై మళ్లీ వ్యతిరేకత వస్తుందన్న అభిప్రాయాలున్నాయి.

సర్దుబాటు సమస్య..

జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు విధిగా వారి సబ్జెక్టు బోధనకు ఎంత పనిభారం ఉందన్న దానిని ఆయా పాఠశాలల హెచ్ఎంలు లెక్కిస్తారు. ఈ వివరాలను ఎంఈవో నుంచి డీఈవోకు అందిస్తారు. వీటిని పరిశీలించిన డీఈవో సంబంధిత పాఠశాలోని ప్రవేశాలు, గత విద్యార్థుల సంఖ్యను గమనించి ఉపాధ్యాయుల అవసరాన్నిబట్టి నివేదికలు తయారుచేయడం, ఎక్కువగా ఉపాధ్యాయులుంటే వారిని డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేయాలని కలెక్టర్‌కు నివేదికలు పంపించి ఆయన ఆదేశాలతో సర్దుబాటు చేస్తారు.

వాస్తవానికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య అధికంగా ఉంటే, ఉపాధ్యాయులు సరిపడ ఉంటే విద్యావలంటీర్లు కావాలన్న నివేదికలు అందించి కలెక్టర్ ఆదేశాలతో ఎస్ఎంసీతో కలిసి వలంటీర్లతో విద్యార్థులు బోధనకు ఆటంకం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటికీ విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఉపాధ్యాయులు సర్దుబాటు చేయలేదు. దీనిపై ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు వినతులు సమర్పించినా అధికారుల నుంచి స్పందన లేదని, ఇంతటి అలసత్యంతో కూడిన సమస్యలు తమకు ఎదురుకాలేదన్న విమర్శలున్నాయి.

పర్యవేక్షణ అధికారులు లేమి..

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు విన్నవించే విద్యావిధానాన్ని గాడిలో పెట్టే ఎంఈవో లేక జిల్లాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లాలో 13 మండలాలుంటే వీటిని పర్యవేక్షించేందుకు కేవలం ముగ్గురు మాత్రమే ఎంఈఓలు విధుల్లో ఉన్నారు. వీరంతా వేరే పాఠశాలలో హెచ్ఎంలుగా ఉండి పూర్తి బాధ్యతలతో ఎంఈఓలుగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో వారితో సమానంగా పనిచేసిన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు వారి ఆదేశాలను పాటించడం లేదని సమాచారం. ఇప్పటికైనా పూర్తి స్థాయి ఎంఈఓలు వచ్చేలా చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

బయాలజీ టీచర్ లేరు..



మాకు బయాలజీ టీచర్ లేరు. గతంలో ఉన్న టీచర్ కరీంనగర్‌కు వెళ్లిపోయారు. మాకు సబ్జెక్టు చెప్పే టీచర్లు లేక ఇబ్బంది పడుతున్నం. పాఠాలు చెప్పడానికి మరో సారు వస్తారని పెద్దసారు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు సార్లేవరూ రాలేదు.

– అన్నల్‌దాస్ సహస్రిక, జెడ్పీహెచ్ఎస్, శివానగర్, సిరిసిల్ల

ఉపాధ్యాయులను కేటాయించాలి



పాఠశాలలో బోధన, వసతి బాగుందని విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. కానీ ట్రాన్స్‌ఫర్స్, విద్యార్థుల ప్రవేశాల పెరుగుదలతో సార్లు సరిపోవడం లేదు. కనీసం నలుగురు టీచర్లు కావాలని అడిగినం. ఈనెల కేటాయింపులు చేయాలని కోరినం. ఇవ్వని పక్షంలో కలెక్టర్‌ను కలిసి విషయం చెబుతాం.

– కోడం శ్రీధర్, ఎస్ఎంసీ ఛైర్మన్, సిరిసిల్ల బాలికల పాఠశాల

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్

- పందిళ్లు తీసేసి పక్కా టేలాలు వేసి..
- ఆందోళనలో లాలపల్లి వాసులు



పెద్దమ్మచౌక్ వద్ద ప్రభుత్వ భూమిలో రోడ్డుపై ఏర్పాటు చేసిన టేలా

వేములవాడ: పట్టణంలోని పెద్దమ్మ చౌక్‌లో ఇటీవల రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. దీంతో లాలపల్లికి చెందిన కొంతమంది ఎమ్మెల్యే రమేశ్‌బాబు హరిత దినోత్సవంలో పాల్గొనేందుకు ఈ ప్రాంతానికి రాగా ఆయనను కలిసి ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలపై వివరించి కంటతడిపెట్టారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌కు పందిళ్ల, టేలాలు తొలగించాలని ఆదేశించారు. వెంటనే కమిషనర్ తన సిబ్బందిని పంపించి వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈక్రమంలో పందిళ్లను తొలగించిన ప్రైవేట్ వ్యక్తులు పక్కాగా టేలాలు వేయడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతంలో పక్కాగా టేలాలు ఎందుకు వేశారంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పాటుచేసిన టేలాలు, పందిళ్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ అన్వేశ్‌ను వివరణ కోరగా పందిళ్లు తొలగించామనీ, త్వరలో టేలాలు తొలగిస్తామన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రేమ్‌దీప్ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. పోలీసులు తనిఖీలు చేస్తుండగా కొంతమంది వాహనదారులు అడ్డదారుల గుండా ప్రయాణించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓ సారూ.. కేటీఆర్‌ను కలుస్తాం..!

- జెర కలువనియ్యండయ్యా...
- పాపం.. బాధితులు..!
- ఎవరికీ పట్టని సామాన్యులు..



‘ఇద్దరు పిల్లలతో కన్నీరుపెడుతున్న ఈమె పేరు ఆకుల సునంద . తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన సునంద భర్త నారాయణ రెడ్డి 2020 జూలై 20 రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భర్త మరణించే నాటికి ఆమె 4నెలల గర్భిణి. అప్పటికే ఒకపాప సాన్వికరెడ్డి ఉంది. ఎంకాం చదివిన సునందకు వితంతు పెన్షన్ రావడం లేదు. ఉండేందుకు ఇల్లులేదు. తన కష్టాలను మంత్రి కేటీఆర్‌కు చెప్పేందుకు గురువారం సిరిసిల్లకు రాగా.. ఆమెకు కలిసే అవకాశమే రాలేదు. దీంతో ఇద్దరు పిల్లలతో కన్నీరుపెడుతూ.. మనోవేదనతో ముందుకు వెళ్లడంతో మంత్రి కేటీఆర్ దగ్గరకు తీసుకుని సమస్యను విన్నారు. ఆమెకు సాయంచేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని ఆదేశించారు. ‘మీరు ముందుగా అన్నం తినండి.. పిల్లలకు పెట్టండి అంటూ.. మంత్రి కేటీఆర్ పురమాయించడం విశేషం.’



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్


సిరిసిల్ల: మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గమైన సిరిసిల్లకు వచ్చినప్పుడు బీఆర్ఎస్‌కు చెందిన నేతలే మంత్రి కేటీఆర్ చుట్టూ చేరి సామాన్యులను కలవనీయడం లేదు. నిజానికి ఎంతో ఆశతో.. దూర ప్రాంతాల నుంచి వచ్చే సామాన్యులు మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తే.. పరిష్కారం దొరుకుతుందనే ఆశతో వస్తారు. కానీ కనీసం కలిసే అవకాశం లేక బిక్కుబిక్కుమంటూ.. ఆవేదనతో వెనుదిరుగుతున్నారు. మరోవైపు మంత్రి కేటీఆర్‌కు మూడంచెల భద్రతను పోలీసులు కల్పిస్తున్నారు. జిల్లా సివిల్ పోలీసులు, డిస్ట్రిక్ట్ గార్డ్‌లు, మంత్రి కేటీఆర్ వెంట వచ్చే రక్షణ సిబ్బంది ఇలా మూడంచెల భద్రత ఉండడం.. చుట్టూరా.. బీఆర్ఎస్ నేతలు ఉండడంతో సామాన్యులు సిరిసిల్ల ఎమ్మెల్యేను కలవలేక పోతున్నారు. జెర మంత్రిని కలుస్తాం.. కలువనియ్యండయ్యా.. అంటూ.. సామాన్యులు వేడుకుంటున్నారు. మంత్రి కేటీఆర్‌ను సామాన్యులు కలిసే రోజు ఎప్పటికైనా వస్తుందో.. లేదో...!?



‘ఈమె పేరు అజ్మీరా రేణ. భర్త పేరు దేవులా. గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రేణకు మూడెకరాల భూమి ఉంది. కానీ పోడు భూముల పట్టా రాలేదు. ఇద్దరు కొడుకులున్నారు.. ఎక్కడా ఇంకా భూమిలేదు.. కూలి పనిచేసుకుని బతకాలే. ఉన్న భూమికి పట్టా రాలేదని రేణ మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు వస్తే.. కేటీఆర్ చుట్టురా ఉన్న పోలీసులు, నాయకులు, అధికారులు రేణకు మంత్రిని కలిసే అవకాశం ఇవ్వలేదు. దీంతో ఆమె కన్నీరుపెడుతూ.. వెనుదిరిగారు.’ ఇది ఈ ఇద్దరి ఆవేదనే కాదు.. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల పర్యటనకు వచ్చిన ప్రతీసారి వందలాది మంది సామాన్యులు చేతిలో కాగితంతో వస్తారు. మంత్రిని కలిసేందుకు గంటల తరబడి వేచిచూస్తారు. కానీ ఆయన్ని కలిసే అవకాశం రాక.. లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు.

సెస్‌లో బది‘లీల’లు

- పాత ఎండీ పేరుతో ఉత్తర్వులు
- సిబ్బంది నిర్లక్ష్యానికి పరాకాష్ట



Proceedings of the Managing Director, CESS Limited, Sircilla
Present: Sri N.Surender, Managing Director(FAC), CESS
Proc.No ... Date:06-07-2023
Sub:- CESS. Ltd., Sircilla - Estt. - certain Assistant Accounts Officers transfer & ... allocation - Orders - Issued.
ORDERS:
The following Assistant Accounts Officers are here by transferred from various sections of CESS Ltd., Sircilla on administrative grounds.

Sl. No	Name of the Employee	Present working section	Transferred section	Under control of works
1	Sri A.Devender Kumar	EAO Sircilla town	Expenditure, Pay bills	Expenditure, Paybills, Cash & Work order
2	Sri G.Jagadeesh Chandra Prasad	Thangallapally	ERO Thangallapally sub-division	[illegible]
3	Sri P.Rajender	[illegible]	[illegible]	[illegible]
4	Sri E.[illegible]	[illegible]	[illegible]	[illegible]
5	Sri A.[illegible]	[illegible]	[illegible]	[illegible]

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో అధికారులు బదిలీలు చేపట్టారు. ఇటీవల అవినీతి.. అక్రమాలపై ఆరోపణలు వస్తుండడం.. కొందరు అధికారులు ఒకే చోట పదేళ్లకు పైగా పనిచేస్తుండడంతో బదిలీలకు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ బదిలీల ప్రక్రియలో సిబ్బంది నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. గురువారం రాత్రి వెలువడిన బదిలీల ఉత్తర్వులు పాత మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ పేరుతో రావడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఎండీ రామకృష్ణ రెండున్నరేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా రు. సెస్ స్వయం ప్రతిపత్తి గల సంస్థ కావడంతో బదిలీలు సంస్థ పరిధిలోనే జరుగుతాయి. కాగా కొందరు అధికారులు పదేళ్లుగా ఒకే సీట్లో కూర్చుంటున్నారని బదిలీలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సంస్థకు ఇటీవల ఎన్నికలు జరుగగా పారదర్శక పాలన కోసం బదిలీలు చేపట్టారన్న అంశం తెరపైకొచ్చింది.

367 మంది సిబ్బందిలో..

సెస్ పరిధిలో జిల్లాలోని పదమూడు మండలాల్లో 367 మంది పనిచేస్తున్నారు. మొదటి విడతలో గురువారం 23 మందిని బదిలీ చేయగా.. ఇందులో ఏడుగురిని ప్రమోషన్లతో స్థానచలనం చేశారు. మిగతా సిబ్బందిని కూడా సెస్ నిబంధనల ప్రకారం బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు సంసిద్ధులైనట్లు తెలిసింది. అయితే బదిలీల ఉత్తర్వులు మాత్రం పాత ఎండీ పేరుతో రావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై సెస్ ఎండీ రామకృష్ణను వివరణ కోరగా.. టైపిస్ట్ తప్పుగా ప్రింట్ చేశారని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ స్వంత ఇల్లు ఉండి ఆధార్ కార్డ్, పాన్‌కార్డ్ ఉన్న ప్రతిఒక్కరికి 1 లక్ష నుండి 10 లక్షల వరకు అతి తక్కువ ఋణాలకు సలహాలు ఇవ్వబడును. ఫోన్: 7989671278. [H-796915]

ASTROLOGY

■ శ్రీసాయిబాబా జ్యోతిష్యాలయం విద్య ఉద్యోగం వివాహం ఆరోగ్యం స్త్రీప్రేమ ఆర్థిక దాంపత్య సమస్యలు సంతానఫలం స్త్రీ పురుషుల వశీకరణం ఎటువంటి సమస్యలైనా 3రోజులలో పరిష్కారం చేయగలరు. ✆ 9740627373. [O-769023]

CHANGE OF NAME

■ I, Atul Kumar, R/o. B-9/9, PTS-Colony, Ramagundam, Jyothingar, Paddapalli, Telangana - 505215, have changed my minor child's girl name from Jigyasa Kumari to Jaimol Kumari, Jigyasa Kumari and Jaimol Kumari is same girl for all purposes. [HA-33528]

WANTED

■ కరీంనగర్‌లో Amazon Large లో పని చేయుటకు Delivery Executives & టాటా ఏస్ వెహికిల్స్ కావలెను. సంప్ర: సెల్: 9052922226, 8639651495. [K-1219850]

■ Wanted Female TeleCallers for Credit Cards Sales. Qlf: Any Degree. Salary: 8,000 - 10,000/- Immediatly Cont: 9963490087. [WA-863]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221195]

■ హైదరాబాద్ ఏరియాలో పనిచేయడానికి హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. చదువు లేకున్నా జాబ్. జీతం: 18 నుండి 20 వేలు వసతి కలదు. Ph: 8096309212 [H-781393]

■ Wanted req. IndusInd, HDFC Banks Loan Recovery boys. Field & Sales Managers & Work from Home female Telicallers Credit Cards Sal: 25K - 47K forwards to W/app 6281159171 [HA-30187]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

■ అద్భుత అవకాశం Hyd లో గల మా సంస్థ యందు డోర్ టు డోర్ సర్వే చేయుటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ+ కమీషన్, రూం+భోజనం ఉచిత వసతి కలదు. 10th, ఇంటర్, డిగ్రీ, పాస్/ఫెయిల్ వారు సంప్రదించండి. ఫోన్ : 7989371766, 7013191934 [H-780893]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

పట్టా పేరిట ఊటకుంటకు ఎసరు

- బావుసాయిపేటలో భూంరావుకుంట కట్ట తొలగింపు
- పనులు అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు



జేసీబీతో భూంరావు ఊటకుంటను తొలగిస్తున్న దృశ్యం

సిరిసిల్ల: ఒకప్పుడు ఊరందరి పశువులు.. వన్యప్రాణులకు తాగునీరందించే కుంటపై కొందరి కన్ను పడింది. తమ పట్టా భూమిలో ఉందని ఏకంగా కుంట కట్టను తొలగించే పనులు చేపట్టారు. గమనించిన గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పనులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోనరావుపేట మండలం బావుసాయిపేట కమ్మరిబండల శివారులో భూంరావుకుంట ఏడెకరాలలో విస్తరించి ఉంది. తమ పట్టాభూమిలో ఉందని ఊటకుంట కట్టను గురువారం తెల్లవారుజామున జేసీబీ సాయంతో తొలగించే పనులు ప్రారంభించారు. గమనించిన గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. వారు వచ్చి పనులను అడ్డుకున్నారు. నీటిపారుదల శాఖ రికార్డుల్లోనూ ఊటకుంటగా నమోదై ఉంది. ఆ కుంటకు జియోట్యాగింగ్ చేసి భూంరావుకుంటను ఉపాధిహామీలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరైనట్లు అధికారులు వివరించారు. ఊటకుంట తొలగింపుపై న్యాయ పోరాటం చేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. భూంరావుకుంటకు మరమ్మతులు చేసి వర్షం నీరు నిల్వ ఉండేలా నీటి పారుదలశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్
- రుద్రంగి జెడ్పీ హైస్కూల్, కేజీబీవీ సందర్శన



చందుర్తిలో ఎంఈవోను వివరాలు అడుగుతున్న డీఈవో

చందుర్తి/సిరిసిల్లఅర్బన్/రుద్రంగి/వేములవాడఅర్బన్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. చందుర్తి మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఈ సందర్భంగా తనిఖీచేశారు. అనంతరం చందుర్తి ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్‌దీక్షితులను కలిసి పాఠశాలల పనితీరు అడిగి తెలుసుకున్నారు. మన ఊరు మన బస్తీ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని డీఈవో సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి బాబాజీనగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చేపడుతున్న సెప్టిక్ ట్యాంక్, కిచెన్ షెడ్, టాయిలెట్స్ తదితర పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మాట్లాడి, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు. ఈ సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీచేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మై వేములవాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై అడిగితెలుసుకున్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసిన ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

ప్రతిభ ఉన్నా.. ప్రోత్సాహం సున్నా

- పారా త్రోబాల్ క్రీడలకు యువకుడి ఎంపిక
- మలేషియాలో ఇంటర్నేషనల్ పోటీలు
- అక్కడికి వెళ్లేందుకు సహకరించని ఆర్థిక పరిస్థితి
- దాతలు సహకరించాలని వేడుకోలు



గెలుపొందిన బహుమతులతో సింగారం బాబు

రుద్రంగి(వేములవాడ): ప్రతిభ అపారం.. అయితే ప్రోత్సాహం లేకనే నిరుపేద యువకుడు మలేషియా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాడు. రుద్రంగికి చెందిన సింగారం బాబు పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. చెన్నైలో డిసెంబర్ 22 నుంచి 27 వరకు జరిగే పోటీలకు వెళ్లాల్సి ఉంది. అలాగే మలేషియాలో ఈనెల 27 నుంచి 31 వరకు జరిగే ఇంటర్నేషనల్ పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అయితే మలేషియా వెళ్లేందుకు ఆర్థిక పరిస్థితులు అంతంతే ఉండడంతో దాతల కోసం ఎదురుచూస్తున్నాడు.

ప్రభుత్వం నుంచి అందని ప్రోత్సాహం

సింగారం బాబు పారా త్రోబాల్‌లోనే కాకుండా గతంలో పారా వాలీబాల్ క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లకు ఎంపికయ్యాడు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో దాతల సహకారంతో పోటీల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం కూడా మలేషియా వెళ్లేందుకు దాతలు సహకరిస్తే పోటీల్లో పాల్గొని దేశానికి పేరు తెస్తానని అంటున్నాడు సింగారం బాబు.

కేటీఆర్‌కు ట్వీట్

బాబు సాధించిన విజయాలు వివరాలు తెలుపుతూ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశానని.. అయితే ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దాతలు సహకరించి ఆర్థిక సహాయం చేస్తే పోటీల్లో పాల్గొంటానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

దేశాభివృద్ధిలో యువతే కీలకం

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి



సిరిసిల్లలో యూత్ కాంగ్రెస్ బైక్‌ర్యాలీ

సిరిసిల్లటౌన్/వేములవాడ: దేశాభివృద్ధిలో యువత కీలకమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో గురువారం యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. యువతకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర సర్కారు యువత సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రగతిభవన్, అసెంబ్లీ కట్టేందుకు వేలాది కోట్లు ఖర్చుచేసిన సీఎం కేసీఆర్ ఆ డబ్బులతో నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించే ఇవ్వవచ్చన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది నిరుద్యోగులకు బాసటగా నిలుస్తుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు ఆదిశ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్, ఉపాధ్యక్షుడు రెడ్డిమల్ల భాను, చుక్కశేఖర్, రాజు, వంగ మల్లేశం, రోహిత్‌నాయక్, సతీశ్ పాల్గొన్నారు.